# అభిమానం

పాత్రలు

రాము :

గౌరి :

తల్లి :

మహాలక్ష్మి :

1 వ రంగం

గౌరి: ఇంత రాద్ధాంతం నాకుమాత్రం సరదా యేమిటి?

రాముం: నేను సరదా అన్నానా? కన్న తల్లయినా కట్టుకున్న పెళ్ళామైనా యింట్లో మగాడి కష్టసుఖాలు కొస్త ఆలోచించాలి.

గౌరి: మీ అమ్మ - మీ చెల్లెలు ఎంత డబ్బు తీసుకున్నా లేనిది - నామీద విరుచుకుపడింది...ఆ మాత్రం స్వాతంత్ర్యం నాకు లేదా?

రామం: ఎవ్వారిదీ తప్పులేదు - తల్లికదా అని స్వతంత్రించి అమ్మ అయిదురూపాయలు తీసింది. చెల్లెల్ని కదా అని స్వతంత్రంగా లక్ష్మి ఏడురూపాయలు తీసింది. భార్యనికదా అని నువ్వు మూడు రూపాయలు తీశావు. పదిహేను రూపాయలతో నా స్వాతంత్ర్యం హుళక్కి.

గౌరి: ఎవరేది తీసుకున్నా లేనిది నేను తీసుకుంటే వచ్చింది మీకు బాధ.

రామం: బాధేమిటి? తెలియని విషయం తెలుసుకోవాలి.

గౌరి: నాకు బాధయెందుకు! నే వలా పెట్టిపుట్టాను.

రామం: అసలు డబ్బేమయిందని అడిగి తెలుసుకుంటే వాళ్ళకిద్దరికీ కోపాలొచ్చాయి...ఏ లక్షాధికారినో అయితే నాకు మీకుకూడా అంత బాధ ఉండేది కాదు...

గౌరి: మొన్ననూ అలాగే - దాసీదానికి మూసెడు బియ్యంఅన్నం పెడుతూంటే ఊరుకోలేక 'అదేమిటం డత్తయ్యా అంత అన్నం పెడుతున్నారు?' అన్నంత మాత్రానికి ఆ పేళ్లా భోజనం చెయ్యలేదు. వారం రోజులు మాట్లాడలేదు.

రామం: అటువంటి వేమీ మనస్సులో పెట్టుకోకు. ఆవిడ స్వభావం అది...నన్ను మాత్రం అనడంలేదూ?

గౌరి: మీ రెన్ని చెప్పండి, నా కింక సుఖపడే యోగ్యతలేదు.

[అమ్మ, చెల్లెలు మహాలక్ష్మి ప్రవేశం]

తల్లి: సుఖపడమ్మా సుఖపడు. నే నవతలకి విరగడైపోతే నీకంతా సుఖమే .. రావే మహాలక్ష్మి - కన్నకొడుక్కి నేను విషమైపోతే, నీ కవటం గొప్ప యేముంది?

రామం: ఎక్కడికమ్మా?

తల్లి: ఏట్లోకి.

రామం: (నమ్రతగా) అమ్మా, ఇంట్లోంచి వెళ్లిపోతున్నావా?

తల్లి: పోక యేంచెయ్యను బాబూ! నాకు గౌరవంలేదు. నామాటకు లక్ష్యంలేదు.

రామం: ఇలా చూడు.

మహాలక్ష్మి: కాకపోయినా అన్నయ్యా - నువ్వు మారిపోయావు. - లేకపోతే చెప్పకుండా డబ్బుతీశామని అంత గొడవ దేనికి?

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

## పమ్మి వీరభద్రరావు

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

రామం: గొడవేముంది - డబ్బు తక్కువైతే మీరు తీశారా అని అడిగి, తీశామన్నాక యేమన్నా అన్నానా? - గౌరిని పిలిచి నీవుకూడా యెందుకు తీశావు' అని అడుగుతున్నాను. అంతేనా?

మహా: అంతేలే.

రాముం: ఉన్న రెండెకరాల గింజలు తిండికి సరిపోతాయి. నాకొచ్చేది ముప్ఫయి అయిదురూపాయలుజీతం పైఖర్చుకొస్తుందా యీబస్తీలో? ఒక్కసారి పదిహేనురూపాయలు అనవసరపు ఖర్చయిందంటే - నా తికమక లెవరికి తెలుస్తాయి?

మహా: నే తీసుకున్న సొమ్ము యింటికి వెళ్లి పంపుతా -

తల్లి: నాదిమాత్రం అప్పే పెట్టుకుంటానా, మాటవచ్చాక? తలతాకట్టు పెట్టైనా పంపించేస్తాను....రా.

రామం: ఈమాత్రం దానికి కన్న కొడుకుని కాదని ఇంట్లోంచి వెళ్ళిపోతావా అమ్మా?

తల్లి: కన్నకొడుకుచూడకపోతే కూతురు చూస్తుంది.

గౌరి: మహాలక్ష్మి! ఇంటి ఆడబడుచు అలిగి వెళ్లకూడదమ్మా - పండగ వెళ్లేదాకా ఉండండి.

మహా: నే నేం చెప్పను. దాని కిక్కడ వాతావరణం సయించడంలేదు.

రామం: చిన్న విషయానికి స్పర్ధపెట్టుకుని కొడుకుని కాదని వెళ్ళిపోతావా.

తల్లి: కన్నకొడుకు నామాట కాదంటూంటే!

రామం: ఏమన్నాను. నా కష్టసుఖాలు కొస్తకనిపెట్టమన్నాను. మన మెంతభాగ్యవంతులమో మనకు తెలుసుకదా! పైగా అదైనా మిమ్మల్ని యేమీఅనలేదే, గౌరితో చెప్పుకుంటున్నానుకాని.

తల్లి: మాతో యెందుకు చెబుతావు - దానిమీదవంక పెట్టి అందరినీఅంటున్నావు.

రామం: తప్పు అభిప్రాయపడుతున్నావు. నీ స్వేచ్ఛకు నీ అభిప్రాయానికి యెప్పుడూ అడ్డురాలేదు. నీమాట కెదురు చెప్పలేదు.

మహా: బండికి టైమయింది రావే వెడదాం.

గౌరి: మహాలక్ష్మి! నేను చెప్పినమాట విను పండగ వెళ్లేదాకా ఉండు.

మహా: పాడి ఉండగా పరవాన్నం - తల్లి ఉండగా పుట్టిల్లు...దానికే టికాణా లేదు నాకెందుకు?

రామం: మీరు నన్ను తప్పు అభిప్రాయపడుతున్నారు మీకు యిది న్యాయంకాదు.

తల్లి: నువ్వు న్యాయంచేస్తే అనుకోవచ్చు.

రామం: నేను చేసిన అపచారం యేమిటో నాకు స్ఫురించడంలేదు.

మహా: తప్పు చేసినవాడికి తప్పు కనుపిస్తుందా?

తల్లి: బాగా చెప్పావు.

మహా: ఆవిడేదో పొదుపు చేస్తున్నట్టు, మనం చెయ్యనట్టు.

తల్లి: ఇక మాట్లాడకు. మన కనవసరం. పొదుపు చేసుకుంటే యెవరికి కావాలి, ధారపోసుకుంటే యెవరికి కావాలి? పోదాం - పద.

రామం: అమ్మా! నా పరువు మర్యాదలు కొస్త చూడు. వంశప్రతిష్ఠ కొస్త ఆలోచించు.

తల్లి: అందుకోసమే నన్ను బ్రతిమాలుతున్నావు, నా కోసం నా సౌఖ్యంకోసం కాదు!

రామం: అలా విపరీతార్థాలు తీస్తే యేమి చెప్పను? తిండిపెట్టలేక తోలేశా ననుకుంటుంది లోకం. అభిమానం భరించలేను.

తల్లి: ఓ – యిప్పుడొచ్చిం దభిమానం!

మహా: నీ బ్రతుకంతా వాడితోనే ఉందనుకున్నాడు!

తల్లి: పెళ్ళాం చేతిలో పిల్లిపిల్లయితే వాడికేలేదు నాకేమిటింక!

మహా: అవునులే – నీ జిగినీ తీస్తుకున్నావా పెద్దపెట్టెలోది?

తల్లి: అది యిందాకనే జాగ్రత్తపడ్డా… రెండువందల రూపాయల జిగినీ పోతుందనే యీ ప్రేమంతా.

రామం: జిగినీ నీ యిష్టంవచ్చినవాళ్ళకిచ్చుకో – నా కక్కరలేదు. నన్ను మన్నించు. నాదగ్గర ఉండు.

తల్లి: రావే – టయిమయింది.

[నిష్క్రమణ]

రామం: వినవుకదూ – అమ్మా! వినవూ.

గౌరి: ఇంకా వినేదేమిటి – మన మొహాన్నలా ఉంది.

*　　　*　　　*

## 2 వ రంగం

రామం: (మూల్గుతూ – దగ్గుతూ) అబ్బ! అమ్మ! – ఇవేళ పరిస్థితి యేమీ బాగుండలేదు. గౌరీ! ఈ వేళ తేదీ యెంత?

గౌరి: తర్చు మాట్లాడవద్దన్నారు డాక్టరు — పైగా యిప్పుడు తేదీతో పనియేమిటి?

రామం: ఏమీ లేదు – అమ్మవెళ్ళి యివేళ కెన్నాళ్ళయింది?

గౌరి: నెలపైన రెండురోజు లయింది.

రామం: కొన్ని సంవత్సరాలు గడిచినట్టుంది.

గౌరి: ఆదయ ఆవిడకి లేదు. కొళ్ళు పట్టుకున్నా వినకుండా వెళ్ళిపోయారు.— ఆవేళ ఆ వంకమీద నన్ను కొట్టినా వాళ్లకి తృప్తి కలిగి ఉండేవాళ్లేమో!

రామం: బాగుంది వరస.

గౌరి: ఏం బాధపడుతున్నారో పాపం, నోరేకాని మాయమర్మం యెరుగని మనిషి.

రామం: అదే నేనూ ఆలోచించేది… పైగా మహాలక్ష్మి పెనిమిటి తొందరమనిషి కూడాను.

గౌరి: ఇల్లరికం వెళ్ళిన మగాడికీ కుడువ కూతురింటికెళ్ళిన ఆడదానికీ మానాభిమానాలుంటాయా? తలొంచుకొని కాలక్షేపం చెయ్యాలి కాని.

రామం: ఏమో ఏమిచేస్తుందో.

గౌరి: మందుకు టయిమయింది పుచ్చుకుంటారా?

రామం: పుచ్చుకుంటాలే – మందూ మాకూ పనిచేసేట్టు కనుపించటంలేదు.

గౌరి: పుట్టెడు బెంగపెట్టుకుంటే మందులెలా పనిచేస్తాయి? – మన మొహాన్నిలా వాదు మోయవల్సి వుంది. ఎవరు తప్పిస్తారు.

రామం: అందరూ పొడిచి పొడిచి అడిగితే…

గౌరి: ఎవరు?

రామం: ఎరిగున్నవాళ్లు – స్నేహితులు.

గౌరి: వాళ్లకేం తెలుస్తాయి నిజానిజాలు.

రామం: అయినా నన్ను ద్రోహిలా పరిగణిస్తూంది లోకం.

గౌరి: లోతులు తెలవటం లోకం పని. కొత్త యేముంది?

రామం: ఎలా చెప్పి 'అయ్యో' అన్నవాడు లేడు.

గౌరి: 'మీ అత్తగారు వెళ్ళిపోయిందిట' అని నన్ను చాలామంది అడిగారు.

రామం: ఏమన్నావు?

గౌరి: ఏమంటాను. ఏమన్నా చెబితే విషపునవ్వు నవ్వటం.

రామం: ఎవళ్లకొంపలోనూ యేమీ లేనట్టు.

గౌరి: 'ఆయన దేవుడు. ఆచలవంతా నీదే' నంటూ పెద్ద గొడవ.

రామం: ఆడాళ్ళలా అంటున్నారు. మొగాళ్లు 'పెళ్లాం చాలా పెద్దమనిషి రామం కరుకుమనిషి' అంటున్నారు.

గౌరి: అంతే నేను చెప్పలేదూ?

రామం: ఇందులో యెక్కడైనా న్యాయం కనుపిస్తుందా?

గౌరి: న్యాయముంటే అనుకోవట మెందుకు?

రామం: కన్నతల్లే న్యాయం తెలుసుకోకుండా వెళ్లిపోయింది. పరాయివాళ్ళలా తెల్సుకుంటారు?

గౌరి: అంతేలెండి.

రామం: ఎంతగుట్టుగా కాలక్షేపం చేద్దామన్నా సాధ్యంకాకుండాఉంది దానితో – ఆర్థికపరిస్థితి తెలుసుకోకుండా 'అవి – ఇవి. అన్ని' అంటూంటే యెలాగ?

గౌరి: మొండిపట్టు! కాదంటే కలహం – ఓర్మి వహించాలి. అదితప్ప విడిస్తే ఆవిడ మనస్సు వెన్నపూస.

రామం. ఎంతఓర్మివహించినాఒక్కటే! మొన్నమట్టుకు మొన్న మహాలక్ష్మి కూతురికి కాళ్లగజ్జెలు చేయించలేదని కోపగించింది – మీతో చెప్పలేదు. చేతి గడియారం అమ్మి చేయించాను.

గౌరి: ఆఁ…ఆగడియారం అమ్మేశారా?

రామం: మరెలా చేయించాను?

గౌరి: బాగానే ఉంది వరస. ఇదిగో మందు పుచ్చుకోండి.

రామం: (మందుత్రాగి) అమ్మయ్య – ఈరోగంతో మళ్ళీ ఇరవైరూపాయలు.

గౌరి: ఎంతైనా తప్పదు.

రామం: గౌరీ! ఇలా సుస్తీగాఉంది; ఆరు లంఖణాలు అని ఉత్తరంవ్రాస్తే వస్తుందేమో!

గౌరి: ఎవరు?

రామం: మాఅమ్మ.

గౌరి: ఏమో! ఇప్పట్లో వస్తారనుకోను.

రామం: పోనీ ఉత్తరం వ్రాయటంవల్ల పోయిందేమిటి?

గౌరి: వ్రాస్తే వ్రాయండి.

రామం: వ్రాసి ఉంచుతాను. ఆనక వాళ్లబ్బాయి చేత పంపి పోష్టు చేయించు

గౌరి: పాపం! కష్టమునేది యెరుగరు


# అతిమూత్రవ్యాధి

## వారం రోజులలో నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీనిపాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము. దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స, దీన్ని వాడటంవల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపుతాము.

**50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు**

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A P W)

# ★ అభిమానం ★

పాపం. ఎలాగ ఉన్నారో యేమిటో అత్తయ్య.

రామం: అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వళ్లు జల్లుమంటుంది. పైగా - మహాలక్ష్మి యింటాయన చాలా కరుకుమనిషి.

గౌరి: చుర్రుబుర్రు మనుష్యులే యిద్దరూ కూడా.

రామం: ఏమన్నా యీవిడ ఊరుకోదు.

గౌరి: మరే.

రామం: వాళ్లియిద్దరికే మాటమాట వస్తే మహాలక్ష్మివాళ్లాయన్ని వెనక వేసుకొస్తుంది.

గౌరి: ఇక్కడలా కేకలు కోపాలు భరిస్తారా మరి!

రామం: అది భరించలేకపోతే వచ్చేస్తుందా అని.

గౌరి: అంతకంటె యింకేం చేస్తారు?

రామం: పౌరుషంకొద్దీ ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో?

గౌరి: అంతటి మనిషి కూడాను.

రామం: అందుకే జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భయం వేస్తూంటుంది.

గౌరి: కొత్త పత్యం పుచ్చుకున్నాక ఒకసారి వెళ్ళి చూసిరండి. (బయట బండి చప్పుడు.)

రామం: అలాగే చెయ్యాలి. పొమ్మనరు కదా.

గౌరి: అంటే అననివ్వండి. ఆమాట వాళ్ళకే ఉంటుంది. (గుమ్మంలో బండి ఆగింది. నిశ్శబ్దం)

రామం: ఇదిగో చూడు గుమ్మంలో బండి ఆగింది.

గౌరి: ఎవరు చెప్మా.

రామం: వాకోస మెవరైనా వచ్చారేమో.

గౌరి: చూచి వస్తా మీరు లేవకండి. (వెళ్లి మళ్ళీ త్వరత్వరగా గౌరి ప్రవేశం.)

గౌరి: (నెమ్మదిగా) మీ అమ్మ వచ్చారండి.

రామం: ఆఁ - మా అమ్మ - వచ్చిందా?

గౌరి: అవును - బండి దిగివస్తున్నారు.

[తల్లి ప్రవేశం]

రామం: అమ్మా! అంతా నింపాదిగా ఉన్నారా అక్కడ?

తల్లి: ఆఁ.

గౌరి: కొత్త దాహం పుచ్చుకుంటారా?

తల్లి: వద్దమ్మా.

గౌరి: పోనీ కొత్త కాఫీ పెట్టనా?

తల్లి: వద్దమ్మ - అలా మంచంమీద పడుకున్నావేరా బాబూ?

గౌరి: సుస్తీగా ఉంది - ఆరు లంఖణాలు.

తల్లి: కాస ఉత్తరం వెయ్యకపోయావురా నాయనా? నేను చచ్చిపోయా ననుకున్నావా?

రామం: ఇప్పుడే అనుకున్నాను, ఉత్తరం వెయ్యాలని. రేపు పత్యం పుచ్చుకుంటూ.

తల్లి: ఏమయినా యిం లేనా?

రామం: కాదమ్మా! కంగారుపడక్కరలేదు. మహాలక్ష్మి పిల్లలు కులాసాగా ఉన్నారా?

తల్లి: (మాట్లాడదు)

గౌరి: ఏమండి అత్తయ్యా! వదినా పిల్లలూ కులాసాగా ఉన్నారా?

తల్లి: ఏం చెప్పను. ఎలాపడితే అలా ఉంది ఆ కొంపవరస.

రామం: ఏమమ్మా? గోపాలం యింకా కుదుటపడలే?

తల్లి: పుట్టుకి పుట్టిన బుద్ధి పుల్లల్తోగాని పోతుందా? (ఏడుస్తూ) దాన్ని ఒక్క వరసని బాధ పెడుతున్నాడు.

రామం: నిన్నేమీ అనలేదు కదా?

తల్లి: అడ్డంపడితే నన్నూ నానాబూతులు తిట్టాడు.

రామం: వద్దని చెప్పలేదమ్మా! దుష్టుడికి దూరంగా ఉండాలి. కాని మాట అన్న తరువాత బాధ యెందుకు?

గౌరి: అయిందేదో అయిపోయింది... విచారించి ఫలిత మేమిటి?

తల్లి: వాడి మొహంమండ చంటిపిల్ల కడియాలు గజ్జెలు అమ్మి జూదంలో పెట్టాడు (ఏడుస్తూ) నా జిగినీకూడా నాతో చెప్పకుండా అమ్మేశాడు.

రామం: నువ్వు యిచ్చావా?

తల్లి: పెట్టుకుంటానంటే మహాలక్ష్మికిచ్చాను. నాతో చెప్పకుండా యిచ్చేసింది

రామం: పోనీలే. ప్రాప్తం లేని వస్తువు.

గౌరి: ఊరుకోండత్తయ్యా - మనది కాదనుకోవటమే.

తల్లి: కాక యింకేమిటి చేసేది - నా మొహం మండ - చక్కగా పువ్వుల్లో పెట్టి చూస్తుంటే - తగువు పెట్టి లేచిపోయాను. గోపాలం సరేకదా? మహాలక్ష్మికి కూడా నేనంటే కిట్టకుండాపోయింది

గౌరి. వాళ్ళు చూడకపోతే ఆగుతుందా?

తల్లి: గోపాలం ఏంచేసినా మహాలక్ష్మి పల్లెత్తుమాటకూడా అనదు. అదేం కాపరమో.

గౌరి: అయినదానికి విచారించి ఫలితం లేదు... మీరు వెళ్ళిపోతే మీ అబ్బాయికి మనస్సు స్థిమితంలేక ఒంటికి వచ్చింది. పైగా నలుగురూ నాలుగు మాటలూను.

తల్లి: కాదుమరీ - అనవసరంగా అంటే అభిమానంకాదూ? - నాకలా వచ్చింది పోయేకాలం. ఇల్లరికంవెళ్ళిన మొగాడూ కొడుకు కూతురింటికి వెళ్ళిన ఆడదీ ఎవళ్ళు సుఖపడ్డారు?

రామం: పొద్దెక్కింది - స్నానం చేసి భోజనం చెయ్యి.

తల్లి ఇదుగో వెడుతున్నా.

గౌరి: ఆలస్యం చెయ్యకండి - వంట అయింది. ★


